రిక్షావాలా

రచన :
కోరాడ V. సుబ్బారావు

అది ఒక తారురోడ్డు....—

సూర్యుని తీక్ష్ణ కిరణాలకి రోడ్డుమీది తారు వేడెక్కి బుడగలుగా యేర్పడివుంది.

నిర్మానుష్యమైన ఆతారు రోడ్డుమీద బరువుగా రిక్షా త్రొక్కుకుంటూ పోతున్నాడు కిష్టాయి...

కిష్టాయి వదలిన ప్రతి ఊపిరిలోనూ ఆకలి భుసలు విని పిస్తూన్నాయి...చెమటతో స్నానం చేసిన అతని దేహం ఆ నిట్టూర్పుగాలులకు తవతవలాడు తున్నాది.

మాసిన బట్టలతో...సంస్కార హీనమైన తలతో... చెమటలు కక్కుతూన్న శరీరంతో...తడబడుతూన్న కాళ్ళతో ఆతడు అలాగే రిక్షా త్రొక్కుకుంటూ ముందుకు పోతున్నాడు...

ఉదయం ఎనిమిదనగా తీసిన రిక్షాకి పన్నెండైనా ఒక్క కానీ రాలేదు...సాయంత్రం ఐదయేసరికి రూపాయి పావలా అద్దె చెల్లించాలి...

అద్దె అనేసరికి కిష్టాయికి గుండె గుభేలుమంది...

భేతాళుడు వంటి ఆకారంగల ఆ స్వార్థపిశాచ మానిసి అద్దె యివ్వకపోతే యేంచేస్తాడో తను బాగా యెరుగును. తను చూస్తూండగానే తనలాటి అమాయకులను ఎంతమందినో చావతన్ని చెవులు మూసేడు...

తలచుకునే సరికి కిష్టాయి హృదయందడదడ కొట్టుకుంది...

వెన్నుకు అంటిన పొట్టతో...నిస్పృహగా సైకులు రిక్షా త్రొక్కుకుపోతూన్న కిష్టాయికి తనకొంత తన కండ్ల యెదుట సినీమా రీలులా తిరగటం ప్రారంభించింది...

తను అప్పటికి రెండు రోజులైపసు తన సంగతి ఆలావుంచుతే తన భార్యా ఆ చింకిగుడిశలో మంచాన్ని అంటుకు పోయి గడియోక్షణమో అన్నట్టుంది.

హృదయా వేదన్ని అణచిపెట్టుకుని ఆతారురోడ్డు మ్మీద మండుటెండలో త్రొక్కుకు పోతున్నాడు...

"కేసరీ కూల్ డ్రింక్స్" షాపు దగ్గిరకు రాబోయే సరికి ఒక స్థూలకాయుడు "ఏయ్ రిక్షా" అంటూ కేకేసేడు.

రిక్షా ఆగింది...

ఒగర్చుకుంటూ రొప్పుతూన్న ఆ స్థూలకాయుడు రిక్షాలో బైటాయించి "ఆనందభవన్‌కి పోనీయే" అంటూ కాళ్ళు పారదాచేడు రిక్షాదండెలకి...

కిష్టాయి...బరువుగా త్రొక్కుకుంటూ ముందుకు పోతున్నాడు...నీరసంచేత కాళ్ళతో డుకు పోతున్నాయి...అయినా లేని ఓపిక తెచ్చుకుని... "బ్రతకడం కోసమే కష్టించడం" అన్ననూత్రం ప్రకారం ముందుకు పోతున్నాడు...

నాలుగు మైళ్ళదాటి గమ్యస్థానంచేరగానే ఆస్థూలకాయుడు రిక్షా దిగి నాలుగణాలు చేతిలో పెట్టి మెట్లెక్కి వెళ్ళిపోయేడు...

కిష్టాయి తెల్లబోయి నేరుగా గుమ్మంలోకి వెళ్ళి బాబూ అని పిలవబోయేసరికి బొచ్చుకుక్క భౌ భౌ కుంటూ మీదకురికింది...

భయంతో వీధిని పిడి రిక్షా అందుకున్నాడు...

కాని అతనిలోని సత్తువ సన్నగిల్లి పోయింది పూర్తిగా...కళ్ళు తిరగటం ప్రారంభించేయ్...ఒక్క పది గజాలు త్రొక్కేడో లేదో...నిస్త్రాణమైన అతని శరీరం నెలకొరిగి పోయింది...జేబులోని అణాలు తళ్ళి దూరంగా పడిపోయేయి...

ఆ మండుటెండలో వేడికి వుబికెత్తి ఆవిరులు విరజిమ్ముతూన్న ఆతారురోడ్డు మీద కిష్టాయి శరీరం చైతన్యరహితంగా పడివుంది...అతని అవస్థను తిలకిస్తూ మానవులకన్న యంత్రాలే నయం అన్నధోరణిలో అరిక్షా అతడికి కాపలగా నిలుచుంది...

కిష్టాయి యిప్పుడు అన్నీ మరిచిపోయి...ఆనందలోకంలో యెక్కడో యేదో చూస్తూ...ఎండనీ... ఆకలినీ...కష్టాన్నీ...అని భార్యనీ...అందరినీ మరచిపోయేడు...మరి అతడు కండ్లు తెరవకూడదను కున్నాడేమో అలానే వుండిపోయేడు...

ఓ మూడుగంటలు గడిచిపోయేయి అతనిచుట్టూ ఎంత్రంలా పనిచేసుకు పోతూన్న జీవాలు మూగేయి... రిక్షా యజామాని...

"మండుటెండలో కడుపెక్కత్రాగుతే గ్రుడ్లుపేలి చావకేమౌతాడు—వెధవ నాఅద్దె ఎగ్గొట్టేడు." అంటూ రిక్షాని తీసుకుపోయేడు...

"త్రాగుపోతు వెధవలు"

అంటూకితాబుయిచ్చి జారుకున్నాడు రహస్యంగా త్రాగి పెద్ద మనుష్యులుగా చెలామణీయౌతూన్న సంఘీయులు...

మునిసిపాలిటీ వారు మాత్రం ఆ కిష్టాయి శరీరాన్ని పోర్టుమార్టం కోసం హాస్పిటలుకు చేర్పించేరు చెత్తల బండిమీద ? ఇంతకే.

గుడిశలోని కిష్టాయి భార్యా సంగతీ ??? అది దేముడికే తెలియాలి— అంతే...—